క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పురం సెంటర్, బోసుబొమ్మ సెంటర్, సాంబిరెడ్డి హోటల్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ



తాడేపల్లి రూరల్: సీపీఐ రాష్ట్ర పిలుపులో భాగంగా జూన్ 2వ తేదీన జరుగనున్న ధర్నాకు సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య నాయకులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్ల భూమిని ఇల్లు లేని నిరుపేదలకు ఇవ్వాలని.. అర్హులైన పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. జూన్ 2వ తేదీన మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తుడిమెల్ల వెంకటయ్య, గుంటక సాంబిరెడ్డి, షేక్ బాషా, బుర్రముక్కు శ్రీనివాసరెడ్డి, సీతారామయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయినాథ ఆలయ వార్షికోత్సవం నేడు

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న శ్రీ షిర్డీ సాయినాథ ఆలయ నాలుగో వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం స్వామికి కాగడ హారతి, పంచామృతాలతో అభిషేకాలను అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, పీసపాటి సత్యకుమార్, జగదీష్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులకు గ్రామస్తుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

ఫిరంగిపురం: గర్భిణులు ప్రతి నెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యురాలు యానీగ్రేస్ అన్నారు. మండలంలోని పానుగుపాడు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 78 మందికి రక్త, మూత్ర, థైరాయిడ్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషక విలువలతో కూడిన ఆహారం, తాగునీరు గురించి వారికి వివరించారు. రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలని, సకాలంలో మందులు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మందు బాబులకు జరిమానా

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ప్రధాన రహదారి వెంబడి ఈ నెల 18న మద్యం తాగుతున్న ఐదుగురిని రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ గుర్తించి, వారి వివరాలు నమోదు చేసుకున్నారు. వారిపై భారత న్యాయ సంహిత చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా, రూ. 10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

'పాట్' నూతన కార్యవర్గ ఎన్నిక

తెనాలిరూరల్: పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి (పాట్) నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం స్థానిక మారిస్‌పేట రాక్ గాస్పెల్ చర్చ్‌లో జరిగింది. తొలుత అసోసియేషన్ సభ్యులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పాస్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జాన్‌పాల్ పినపాటి అధ్యక్షతన పాట్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, అధ్యక్షులుగా బిషప్ పాముల పరంజ్యోతి, ఉపాధ్యక్షులుగా బిషప్ సాధు థామస్ జూనియర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘాపరుల సమస్యల పరిష్కారానికి తమ అసోసియేషన్ కృషి చేస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ రావూరి విక్టర్ పాల్, రెవరెండ్ సువర్ణ రాజు, రెవరెండ్ మల్లవరపు విజయ్ కుమార్, రెవరెండ్ విలియం కేరీ, పాస్టర్లు షద్రక్, షాలెం రాజ్, సురేష్, ఐజక్ పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. ప్రయాణానికి ఇక్కట్లు!

- గుంతలతో దర్శనమిస్తున్న నగరం రోడ్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు, ప్రజలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లోని రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. మంగళగిరి కార్పొరేషన్‌గా మారితే అభివృద్ధి వేగం అవుతుందని ప్రజలు భావించారు. కానీ పన్నుల భారం మోపినంత వేగంగా అభివృద్ధిలో శ్రద్ధచూపడం లేదన్న విమర్శలు వినబడుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి నారా లోకేష్ నియోజకవర్గంలో గెలిచి మంత్రి అయినా నగర పరిస్థితిలో ఏ మార్పు కనిపించడం లేదని చర్చించుకుంటున్నారు. నగరంలో విలీనమైన గ్రామాలలో రోడ్ల దుస్థితితో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని విలీన గ్రామాల్లోని రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. తెనాలి రోడ్డు నుంచి ఆత్మకూరు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికి సైతం బురదగా మారుతోంది. గుంతల్లో వర్షం నీరు నిలవడంతో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

రోడ్డు ఎక్కితే గాయాలు..

ఎస్సీ కాలనీలోని రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు బురద రోడ్డు ఎక్కితే జారి పడి గాయాలపాలవుతున్నారు. కాజ నుంచి నంబూరు వెళ్లే రోడ్డు గుంతలు పడడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాజ నంబూరు రోడ్డులో లోడు లారీలు తిరగడంతో రోడ్డు పాడవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కాజ టోల్ గేట్ వద్ద ఫీజు తప్పించుకునేందుకు విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లే లారీలు, బస్సులు సైతం కాజ గ్రామ ప్రధాన రహదారి గుండా నంబూరు మీదుగా వెళుతున్నాయి. దీంతో కాజ గ్రామంలోని ప్రజలు రోడ్డు మీదకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దయనీయంగా జగనన్న కాలనీ రోడ్డు..

తెనాలి రోడ్డు ఆత్మకూరు జగనన్న కాలనీకి వెళ్లే రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. గ్రావెల్ రోడ్డు గుంతలు పడడంతో వర్షం నీరు నిల్వ ఉండి బురదగా దర్శనమిస్తోంది. దీంతో ప్రయాణానికి అవస్థలు తప్పడంలేదని వాహనదారులు వాపోతున్నారు. కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డుతో పాటు కాలనీలోని అంతర్గత రోడ్లు సైతం అధ్వానంగా తయారయ్యాయి. సమస్యను కార్పొరేషన్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని విలీన గ్రామాలలోని పలు రోడ్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను బాగు చేసి ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఆత్మకూరు రోడ్డు



బురదమయంగా ఆత్మకూరు జగనన్న కాలనీ

ఇబ్బందులు పడుతున్నాం..



తెనాలి రోడ్డు నుంచి ఆత్మకూరు వచ్చే రోడ్డు గుంతలతో నిండిపోయింది. దీంతో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తెనాలి రోడ్డు నుంచి ఆటో, బస్సు దిగి గ్రామంలోకి రావాలంటే నడిచి వెళ్లాలి. రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే రోడ్డు బాగు చేయాలి.

రావూరి వెంకటేశ్వరమ్మ, ఆత్మకూరు

కేఎల్‌యూలో నూతన కార్యాలయం ప్రారంభం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో కెఫిన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ వెబైల్ యాప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ డిజిటల్ అండ్ ఏఐ ఎక్సలెన్స్(సీఓడీఈ)ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెబైల్ యాప్స్ సీఈవో నజీష్ మీర్ మాట్లాడుతూ.. ఈ కేంద్రం ద్వారా విజయవాడను డిజిటల్, ఏఐ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. దీని ద్వారా వేల సంఖ్యలో అధిక నైపుణ్య ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కెఫిన్ టెక్నాలజీ గ్రూప్ సీఈవో శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద ఇన్వెస్టర్, జారీదారుల సర్వీస్ ప్రొవైడర్‌గా మ్యూచువల్ ఫండ్స్, పెన్షన్, కార్పొరేట్ బాండ్స్ వంటి డొమైన్‌లలో పూర్తి సేవలు అందిస్తున్నామన్నారు. వెబ్, మొబైల్, క్లౌడ్ ఫ్లాట్‌ఫారమ్‌లలో పూర్తి ఉత్పత్తి, అభివృద్ధి సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ నాయర్, జనరల్ అట్లాంటిక్ ఆపరేటింగ్ పార్టనర్ శ్రీనివాస్ పెద్దాడ, వెబైల్ యాప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నజీష్ మీర్, కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుమన్, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీటీఓ వెంకటగిరి, చీఫ్ పీపుల్ ఆఫీసర్ సుజయ్ పుత్రాన్, వెబైల్ యాప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో కెఫిన్ టెక్నాలజీ గ్రూప్ సీఈవో శ్రీకాంత్

గ్రీవెన్స్‌లో రైతుల ఆందోళన

రైతులకు అన్యాయం చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిక

తాడికొండ: తుళ్లూరు ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రైతులు ఆందోళన చేశారు. సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్‌ను కలిసిన రైతులు 'ఈ 5 రోడ్డు నిర్మాణం' కోసం ఇళ్లు కోల్పోతున్న 130 మంది రైతులకు ఇష్టమైన చోట ఇళ్ల స్థలాలు ఇచ్చిన తరువాతే మా ఇళ్లు మార్కింగ్ చేయండని అన్నారు. లేదంటే తాము ఇవ్వమని తేల్చి చెప్పారు. రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సదుపాయాలు ఉన్న ప్రాంతంలో భూములిస్తే సరే.. లేదా ఎక్కడో మూలన మాకు ఇళ్లు ఇచ్చి ఉన్న ఇళ్లను కూల్చితే మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని.. కానీ మాకు అన్యాయం చేస్తే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు జీతాల పెంపు కోసం అదనపు కమిషనర్‌ను కలిసి ఆందోళన వ్యక్తం చేసి అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాల పెంపు విషయాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.రవీందర్, బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కేఎస్ భాగ్యరేఖ, పి.పద్మావతి, ఏజీ చిన్ని కృష్ణ, కె.స్వర్ణమేరీ, జి.భీమారావు, జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, సీఆర్డీయే డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే జి.పాండురంగారావు, రామకృష్ణన్ తహసీల్దార్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీఆర్డీయే అదనపు కమిషనర్‌తో వాగ్వివాదం చేస్తున్న రైతులు

దేశంలో పౌరులకు రక్షణ కరువైంది

సీపీఎం సీనియర్ నాయకుల ఆరోపణ

తెనాలిఅర్బన్: దేశంలో పౌరులకు రక్షణ కరువైందని సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, తెనాలి కార్యదర్శి కెబి.ప్రసాద్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం తెనాలి కమిటీ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం దేశ సమగ్రత, సమైక్యత అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపారని గుర్తు చేశారు. 40 రోజులుదాటినా ఇప్పటి వరకు ఉగ్రవాదుల జాడ కేంద్రం కనుక్కోలేక పోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం ఉగ్రవాదులను శిక్షించాలని కోరారు. నిజాయితీతో వ్యవహరించిన మహిళా మిలటరీ అధికారిపై బీజేపీకి చెందిన మంత్రులు అనుచిత వ్యాఖ్యాలు చేయడం బాధాకరమన్నారు. అలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.రవికుమార్, చిన్ని, ఎస్.ఏసోబు, జి.వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, చిన్న గోపాలరావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.రాజ్యలక్ష్మి, ఎఎల్ సునీత, ఈశ్వరి, చంద్రకళ, కళ్యాణి, ఎం.సాంబశివరావు, పోతురాజు, సిహెచ్.శేషగిరిరావు, ఎం.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

శివాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

తెనాలిటౌన్: ఛత్రపతి శివాజీ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని శివాజీ స్మారక సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మైలా హరికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని ది-కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ సమావేశ మందిరంలో శుక్రవారం శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. మైలా హరికృష్ణ మాట్లాడుతూ జూన్ 8వ తేదీ ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు సుల్తానాబాద్‌లోని మార్కెట్‌యార్డు వద్ద నుంచిబైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టే దిశగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శివాజీ స్మారక సమితి గౌరవ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగిస్తూ మే 25వ తేదీన శివాజీ డిజిటల్ డ్రామా స్ఫూర్తిదాయకంగా ప్రదర్శించినట్లు చెప్పారు. హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో హిందు బంధువులందరూ ఏకం కావాలని పిలుపునిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యర్రంశెట్టి హనుమంతరావు, అంబటి మారుతీరామ్,హస్‌మత్ ప్రసాద్, పి.శ్రీనివాస్, కఠారి వాసు దేవనాయుడు, ఉలగంటి శ్రీనివాస్, నంద కిషోర్, రమాదేవి, శారద, ఎం.వీరాంజనేయులు, పూర్ణ, సునీల్, నాగార్జున, హరి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు సేవలు అభినందనీయం



తాడేపల్లి రూరల్: రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నాగరాజు అందించిన సేవలు అభినందనీయమని సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో నాగరాజు పదవీ విరమణ వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ.. నాగరాజు క్రమశిక్షణ, స్నేహపూర్వకంగా అందరితో కలిసి మెలసి పనిచేశారని అన్నారు. ఆయన అపారమైన జ్ఞానం, స్నేహశీలత, నిజాయితీని కలిగి ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం నాగరాజును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పలువురు ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

తాడికొండ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం తాడికొండలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించనున్నట్లు తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్) శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు తాడికొండ సాయిబాబా ఆలయంలోని ఫంక్షన్ హాల్‌లో జూన్ 4న వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంపై చర్చించనున్నామని అన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, మండల విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ స్థాయి విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు అందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో డాక్టర్ గణేష్ జట్టు విజయం

రేపల్లె: జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ టీం క్రీడాకారులు ప్రతిభ చాటారు. గత 10 రోజుల నుంచి కొల్లూరులో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో పాల్గొన్న చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని డాక్టర్ ఈవూరి గణేష్ టీమ్ ప్రతిభ చాటి విన్నర్‌గా నిలిచింది. ఇటీవల కృష్ణా జిల్లా ఘంటసాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో రామకృష్ణారెడ్డి టీం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను గణేష్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

యోగా, ధ్యానంకు సమాయాన్ని కేటాయించాలి



రేపల్లె: పని భారంతో మానసిక సంఘర్షణకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ యోగ, ధ్యానం వంటి వాటికి కొంత సమయాన్ని కేటాయించాలని ఎంపీడీవో ఎం.శోభారాణి చెప్పారు. పట్టణంలోని పత్తిపాటి సీతారామ యోగిని కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బందికి శుక్రవారం జరిగిన యోగాంధ్ర-2025 శిక్షణ తరగతులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరటంతో పాటు మానసిక రుగ్మతలు తొలగుతాయన్నారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సచివాలయ ఉద్యోగులు యోగాతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల విజృంభణ నివారణకు చర్యలు

తాడేపల్లి రూరల్: దోమల విజృంభణ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ పొట్లూరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కరకట్ట వెంబడి పలు నివాసాలను ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనా క్రమంలో కొన్ని నివాసాల్లో రోళ్లు, పాత టైర్లు, ఇతర వస్తువులలో వర్షం నీరు, మంచి నీరు నిల్వ ఉంచడాన్ని గమనించారు. వాటిని కార్పొరేషన్ సిబ్బందితో తొలగించి డెటాయిల్, బ్లీచింగ్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల వల్ల అనేక వ్యాధుల వస్తాయని, దోమల లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత టైర్లు, కూలర్లు, రోళ్లలో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని ఆయన వివరించారు.

మంగళగిరి టౌన్: దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా తెలిపారు. టిప్పర్ల బజారులో ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే ద్వారా వ్యాధులను ఎలా అరికట్టవచ్చని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. అలీమ్ బాషా మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాల పరిశుభ్రతను పాటించి డయేరియా, చికెన్ గున్యా, మలేరియా వంటి విష జ్వరాలు దరిచేరకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోవులను వధించడం చట్టరీత్యా నేరం

మంగళగిరి టౌన్: గోవులను, లేగదూడలను, పాలిచ్చే గేదెలను వధించడం చట్టరీత్యా నేరమని పలువురు ప్రభుత్వ శాఖల అధికారుల అన్నారు. బక్రీదు పండుగను పురస్కరించుకుని నగర పరిధిలోని కబేళా యజమానులకు ఎంటీఎంసీ కార్యాలయంలోని కౌన్సిలింగ్ హాల్‌లో శుక్రవారం వివిధ శాఖ అధికారులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. బక్రీదు సందర్భంగా సూచనలు తప్పని సరిగా పాటించాలని.. జంతు హింస నివారణ చట్టాల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 7వ తేదీన బక్రీదు పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నగర పరిధిలోని సచివాలయ సిబ్బందిని బృందాల వారీగా ఏర్పాటు చేసి కబేళాల వద్ద నిఘా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, కబేళా యజమానుదారులు తదితరులు పాల్గొన్నారు.



కబేళా యజమానుదారులకు సూచనలు చేస్తున్న అధికారులు

యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం

తాడేపల్లి రూరల్: ప్రతి ఒక్కరికి యోగాతోనే ఆరోగ్యవంతమైన ప్రశాంత జీవితం ఏర్పడుతుందని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మానస సరోవరం పిరమిడ్ ధ్యాన కేంద్రంలో యోగా పోటీలను నిర్వహించారు. యోగా పోటీలలో ప్రత్యేకమైన యోగాసనాలు ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బండారు నరసింహారావు, షార్ట్ ఫిల్మ్ మేకర్ గాదె నాగభూషణంలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, ఆర్వో మురళి, ధ్యాన గురువులు కళ్లం రామిరెడ్డి, ఆత్మకూరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఎంటీఎంసీ అధికారులు, యోగా గురువులు

కార్మికుల చెమటతోనే ఆస్తులు పెరిగాయి

తాడేపల్లి రూరల్: కార్మికుల చెమటతో సిమెంట్ ఫ్యాక్టరీ ఆస్తుల పెరిగాయని, ఐక్యతే ఆయుధంగా కార్మికులు ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ ప్రకటించి 32 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కార్మిక కుటుంబాలు పెద్ద ఎత్తున దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి యూనియన్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. పాలక పార్టీలు కల్పిస్తున్న కొన్ని భ్రమలకు కార్మికులు లొంగిపోవద్దని హెచ్చరించారు. కార్మికులకు నష్ట పరిహారం చెల్లించిన తరువాత భూముల్లోకి వెళ్లే హక్కు కొనుగోలు చేసిన వారికి ఉంటుందని కోర్టులు స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 32 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని అన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. కార్మికులు చేస్తున్న పోరాటానికి పూర్తి అండదండలు ఇస్తున్నట్లు ప్రకటించారు. సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ దీక్షలు కొనసాగిస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య, సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, వైఎస్సార్‌టీయూ నాయకులు ఆర్.శ్రీనివాసరాజు, వై.రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, మరియమ్మ, వై.సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరరావు, మేరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య

సాగర్ జలాలతో చెరువులకు జలకళ



నిండుకుండలా వేమవరం చెరువు

ఫిరంగిపురం మండలంలోని పలుగ్రామాల్లోని చెరువులు సాగర్ జలాలతో కళకళ లాడుతున్నాయి. రెండు రోజులగా సాగర్ జలాలతో తాగునీటి చెరువులను నింపుతున్నారు. వేమవరం, కండ్రిక, గుండాలపాడు, మేరికపూడి, ఫిరంగిపురం, రేపూడి గ్రామాల్లోని చెరువులను సాగర్ జలాలతో నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సమగ్ర మంచినీటి పథకంలో భాగంగా రేపూడి గ్రామంలోని చెరువులు రెండు, ఫిరంగిపురంలోని కోనేరు చెరువులను సాగర్ జలాలతో నిండుగా నింపామని చెప్పారు. వీటికి చిరుమామిళ్లమేజర్, గుంటూరు బ్రాంచి కెనాల్, పెదనందిపాడు బ్రాంచి, గుండాలపాడు బ్రాంచి కెనాల్ ద్వారా సాగర్ జలాలతో చెరువులు నింపినట్లు తెలిపారు. – ఫిరంగిపురం